10122024-DIS-04_Layout 1 12/10/2024 3:39 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## సిరియాలో పెనుమార్పులు

నమస్తే తెలంగాణ

**సిరియాలో** ఐదు దశాబ్దాల అసద్ వంశీయుల నిరంకుశ పాలనకు తెరపడింది. తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్‌ను చుట్టుముట్టిన వేళ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మాస్కోకు పారిపోయి తలదాచుకున్నాడు. తిరుగుబాటు దళాలు గాల్లోకి కాల్పులు జరుపుతూ సంబురాలు జరుపుకొంటున్నాయి. ఒకప్పటి అల్ కాయిదా నేత అహ్మద్ అల్ శరా తన గతాన్ని, పాత మారు పేరును వదిలించుకొని సిరియా పగ్గాలు చేపట్టారు. ఈ పరిణామాలు అంతర్యుద్ధంతో పదిహేనేండ్ల కాలంపాటు కకావికలమైపోయిన సిరియాకు శాంతిని ప్రసాదించగలవా? లేక పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అవుతుందా అనేదే అసలు ప్రశ్న. అసద్ ప్రభుత్వ పతనం తర్వాత జరుగుతున్న కొన్ని పరిణామాలు కలిగిస్తున్న ఆందోళనే ఇందుకు కారణం. సందట్లో సడేమియా అన్నట్టుగా ఇజ్రాయెల్ ప్రస్తుత అస్థిర పరిస్థితులను అలుసుగా తీసుకొని దాడులకు తెగబడుతున్నది. సరిహద్దు భూభాగాలను రాత్రికి రాత్రే ఆక్రమించుకుంది. అంతేకాకుండా రసాయనిక ఆయుధ కేంద్రాలు, క్షిపణి స్థావరాలుగా భావిస్తున్న ప్రదేశాలపై బాంబు దాడులకు పాల్పడుతున్నది. అగ్రరాజ్యం అమెరికా 'నేనేం తక్కువ తిన్నానా' అన్నట్టుగా ఇస్లామిక్ స్టేట్ శక్తులను దెబ్బతీసే సాకుతో 75 ప్రదేశాలపై బాంబులు వేసింది. ఈ దాడులు ఏ మాత్రం వాంఛనీయమైనవి కావు. ఈ దుందుడుకు చర్యల పర్యవసానాలు ఎలా ఉంటాయో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు.

అంతర్జాతీయ శక్తుల ప్రచ్ఛన్న యుద్ధానికి సిరియా వేదికగా మారిన సంగతి తెలిసిందే. ప్రధానంగా అమెరికా, రష్యా, సౌదీ అరేబియా, ఇరాన్ తమ తమ ప్రాబల్యం కోసం సిరియాలో రకరకాల శక్తులను వెనకేసుకు వస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంలో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రష్యా మద్దతు తగ్గించడం వల్లనే అసద్ ప్రభుత్వం పతనమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. షియా-సున్నీ విభేదాలు, రష్యా-అమెరికా తగాదాలకు నెలవుగా మారిన సిరియా బలమైన కేంద్రం అనేది లేకపోవడం కారణంగా ఇప్పుడు జిహాదీ శక్తుల చేతుల్లోకి వెళ్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కారణంగా శాంతి ఎండమావిగా మారి, అంతర్జాతీయ ఉగ్రవాదం పెచ్చరిల్లేందుకు ఆస్కారం ఉన్నది. ఇది సిరియాకే కాకుండా యావత్తు ప్రపంచానికి సమస్యగా పరిణమించవచ్చు. ఇందుకు మనకు అఫ్గానిస్థాన్, ఇరాక్ ఉదాహరణలు ఉండనే ఉన్నాయి.

అసద్ ప్రభుత్వం కూలిపోవడాన్ని సిరియాలో శాశ్వత శాంతిస్థాపనకు ఒక సువర్ణావకాశంగా ప్రపంచ దేశాలు భావించాలి. 2017లో రష్యా, ఇరాన్, టర్కీ ఆధ్వర్యంలో చేపట్టిన అస్తానా శాంతి చర్చల క్రమాన్ని కొనసాగించాలి. ఉద్రిక్తతలు తగ్గించి, మానవతా సహాయం చేరవేతకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడం, రాజకీయ చర్చలకు వీలు కల్పించడం అనే త్రిముఖ వ్యూహంతో ఆ చర్చలు మొదలయ్యాయి. 22 విడతల చర్చలు జరిగినా నిర్వాహకులు ప్రత్యర్థి వర్గాలను చెరోవైపున సమర్థిస్తుండటంతో పెద్దగా పురోగతి సాధ్యపడలేదు. అయితే, పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఏమీ లేదు. సంక్షోభం ముదురుతున్న దశలో మొన్నటి శనివారం మూడు నిర్వాహక దేశాలు ఖతార్ రాజధాని దోహాలో సమావేశమై సిరియాలో కాల్పుల విరమణ, రాజకీయ సంప్రదింపులు, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం ఐక్యరాజ్య సమితి భద్రతామండలి చేసిన 2,254 తీర్మానాన్ని అమలుచేయడంపై ఏకాభిప్రాయానికి రావడం ముదావహం. ఇందుకు సంబంధించిన ఉమ్మడి ప్రకటనపై పైన తెలిపిన మూడు దేశాలతో పాటుగా ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఇరాక్, జోర్డాన్, ఖతార్ సంతకాలు చేశాయి. ఇదే అదనుగా ఐరాస చొరవ తీసుకొని సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు దిశగా కృషిచేయాలి. అంతిమంగా స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు వీలైన పరిస్థితులు కల్పించాలి. ప్రపంచ శాంతికి ప్రజాస్వామిక సిరియా హామీగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

# విగ్రహాలు మారిస్తే చరిత్ర మారదు

చరిత్ర నిర్మాణంలో పాల్గొననివారు మొదట చేయాలనుకునే పని చరిత్రను చెరిపేయాలనుకోవడం. అది కుదరని పక్షంలో దానిని వక్రీకరించడం. ఇప్పుడు తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పనులివే. పట్టుబట్టి మరీ తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చే దుస్సాహసానికి పూనుకున్నది రేవంత్ ప్రభుత్వం. ఈ దుర్ఘటన ఎంతోమంది తెలంగాణవాదులను బాధించింది.

**ఒక జాతి ప్రజలు తమ మూలాలను, పరంపరను తలచుకోవడం ఒక సహజ, స్వాభావిక స్పందన. తమ నేలకు ఒక మూర్తిమత్వ ప్రకటన చేసుకొని గౌరవించుకోవడం ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్కృతుల్లో ఉన్నది. మన దేశంలోనూ భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో తొలిసారిగా 1870 కాలంలో బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం అని తల్లికి నమస్సులను అర్పిస్తే తర్వాత 1905 కాలంలో అబనీంద్రనాథ్ వంటి చిత్రకారులు భరతమాతకు రూపాన్నిచ్చే ప్రయత్నం చేశారు. అనంతరం హరిద్వార్‌లో 1983లో స్వామి సత్యమిత్రానంద్ గిరి అనే స్వామిజీ భరతమాత గుడి కట్టగా దానిని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారు. కిరీటంతో కొలువుదీరిన భరతమాత సమృద్ధికి, సంస్కృతికి నిరంతర స్ఫూర్తిగా నిలుస్తుంది. అలాగే తెలుగు తల్లి కూడా ఏర్పాటైంది. తమిళ తాయి, కన్నడాంబె (కర్ణాటక మాతె) ఇలా ఏ తల్లి అయినా స్థానిక కట్టూబొట్టుతో, ఆభరణాలతో, అక్కడి ప్రజలు ఆరాధించే దేవతలను పోలే ఉన్నరని మనం గుర్తుంచుకోవాలి. తల్లులు సర్వాలంకార భూషితులు. ఇది సమృద్ధికి గుర్తు.**



**కల్వకుంట్ల కవిత**

తెలంగాణ తల్లి ఈ మట్టి నిర్మించుకున్న ఆశల సౌధానికి, ఆత్మగౌరవ రూపానికి మూర్తిమత్వ ప్రకటన. తెలంగాణ తల్లి భావన ఈనాటిది కాదు. 1950లలోనే 'నా తెలంగాణ తల్లి.. కంజాత వల్లి' అని ఈ నేలను తల్లితో పోల్చారు దాశరథి. 1947 ప్రాంతంలో రావెళ్ల వెంకట్రామారావు 'నా తల్లి తెలగాణరా.. వెలలేని నందనోద్యానమ్మురా' అని ఈ నేల గొప్పతనాన్ని కీర్తించారు. సమైక్య పాలనలో ఇక్కడి నేల అడుగడుగునా విస్మరణలకు గురైన సందర్భంలో ఎగసిన తెలంగాణ బిడ్డల పునరుత్థాన కేతనంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో నిలిచింది. ఇక్కడి సంస్కృతి ప్రతి సందర్భంలో అవమానాలకు గురవుతుంటే ఈ బిడ్డలు చేసుకున్న ధిక్కార ప్రకటన తెలంగాణ తల్లి. తెలంగాణ మలిదశ పోరు మొదలైన తర్వాత తెలంగాణ బిడ్డలు తమ న్యాయమైన వాటా కోసం కొట్లాడుతున్నా మరోవైపు సాంస్కృతిక ఆధిపత్యం మాత్రం నిరాటంకంగా కొనసాగేది. పాలన, అధికార భాష, మీడియా, సంస్కృతి, పండుగలు ఇలా ప్రతి రంగంలోనూ తెలంగాణ సంస్కృతి అణచివేతను, విస్మరణను ఎదుర్కొన్నది. ఒకే తెలుగు తల్లి పిల్లలమనే భావోద్వేగపు కపట సమాధానాలు ఈ ప్రజల ఆకలికి, ఆత్మగౌరవానికి సమాధానం చెప్పలేకపోయాయి. పిడికిళ్లెత్తిన బిడ్డల నినాదాల నడుమ అవతరించింది తెలంగాణ తల్లి.

తమ మూలాలు మదిన తలస్తూ బిడ్డలంతా కూడి తల్లికి రూపమిచ్చిన అపురూప సందర్భం అది. తెలంగాణ తల్లి రూపురేఖలపై, ఆహార్యం, అలంకారాలపై విస్తృత చర్చ జరగాలన్న కేసీఆర్ ఆలోచనల మేరకు వారి నేతృత్వంలోనే తెలంగాణ భవన్‌లో నాలుగు రోజుల పాటు వందలాది మేధావులు, కవులు, కళాకారుల మేధోమథనం జరిగింది. అనేక చర్చోపచర్చల అనంతరం వారి సూచనల మేరకు నిర్మల్ కళాకారుడు బీవీఆర్ చారి విగ్రహానికి తుది రూపకల్పన చేశారు. తెలంగాణ నేతన్నలు నేసే పట్టుచీర ధరించింది తల్లి. ఒక చేతిలో తెలంగాణ సంస్కృతికి గుర్తుగా బతుకమ్మ, మరో చేతిలో తెలంగాణ మెట్ట పంటలైన జొన్న, మక్కజొన్న కంకులు. అలాగే ఇక్కడి మహిళలు ధరించే కంటె, హారం, వడ్డాణం, మెట్టెలు తల్లి ధరించింది. కృష్ణానది పరీవాహక ప్రదేశంలో దొరికిన కోహినూర్ వజ్రం కిరీటంలో చేరింది. వడ్డాణంలో జాకొబ్ వజ్రం ఒదిగింది. మొత్తంగా తెలంగాణ తల్లి ఈ నేలకు ప్రతిరూపంగా కొలువైంది. విగ్రహ ఆవిష్కరణకు నగరమంతా ముస్తాబైంది. ఒక పండుగ వాతావరణం నెలకొన్నది. **'వడిసెల చేపట్టి వడివడిగ తిప్పుతూ/ వలస పక్షుల పీడ వదిలి పోవంగ/ రావమ్మ రావమ్మ తెలంగాణ తల్లి'** అంటూ హోర్డింగ్‌లు వెలిశాయి.

తెలంగాణ వాదుల భారీ ఊరేగింపు నడుమ 2007 నవంబర్ 15న ఉద్యమ రథసారథి కేసీఆర్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో తొలి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అది మొదలు పల్లె పల్లెనా తెలంగాణ వాదులు తెలంగాణ తల్లి విగ్రహాలు ప్రతిష్ఠించుకున్నారు. ఇదొక చారిత్రక అవసరం. ఎలా అయితే స్వాతంత్ర్య ఉద్యమకాలంలో భరతమాత భావన భారతీయులనొక్కటి చేసిందో, ఎలా అయితే 1942 కాలంలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలోని ఆంధ్రులు తెలుగు తల్లి భావనతో తమిళులతో ఉన్న తేడాను తమకు తాము స్పష్టపరచుకున్నారో ఇదీ అంతే. ఇదొక అస్తిత్వ ప్రకటన.

**మరోవైపు తెలంగాణకే సొంతమైన మట్టివాసనల పరిమళం బతుకమ్మను ఇపుడు విగ్రహం నుంచి తొలగించడం హేయమైన చర్య. ఇది ఇక్కడి ఆడబిడ్డల సాంస్కృతిక వారసత్వాన్ని కనుమరుగు చేయడమే. ఆ లోటును కాంగ్రెస్ హస్తం ఎప్పటికీ భర్తీ చేయలేదు. మరో పక్క తెలుగు తల్లి చేతిలోని పూర్ణకుంభం స్థానికత్వానికి గుర్తే కదా. మరి తెలంగాణ తల్లెందుకు తన ఆనవాళ్లను కోల్పోవాలి. ప్రతీకలను తీసుకునేది ఒక ప్రాంతంలోని ఉన్నత విలువలను, ఆంశాలను గొప్పగా బయటి ప్రపంచానికి చూపేందుకు కదా.**


ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న వారు ఏ మార్పు చేసినా ప్రజలు స్వాగతిస్తారనుకోవద్దు. ఉద్యమకాలంలో ఏర్పరచుకున్న భావనలను, ప్రతీకలను మార్చాలనుకోవడం ఉద్యమ స్ఫూర్తికి ద్రోహం చేయడమే అవుతుంది. తెలంగాణ తల్లిని ఇక్కడి ఉద్యమం ఏర్పర్చుకున్నది. ఇది కాల నిర్ణయం. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెప్తున్నదే 'కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేస్తా' అని. ఆయనకు అంశాలవారీగా కారణాలు అనవసరం. తనకు స్థానం లేని చరిత్రలో ఇంకెవరూ ఉండకూడదని ఆయన ఉద్దేశం. ఇంకా చెప్పాలంటే అసలా ఉద్యమ చరిత్రే కనిపించొద్దన్నది ఆయన లక్ష్యం కావొచ్చు. ఆయన అర్థం చేసుకోవలసింది తెలంగాణ ఉద్యమం ఎప్పటిదో, ఎవరో చెప్తే విన్న కథ కాదు. మన కండ్ల ముందు జరిగిన చారిత్రక సత్యం. ఇవ్వాళ తెలంగాణలో నూటికి తొంభై తొమ్మిది మందికి రేవంత్ రెడ్డి కన్నా గొప్ప ఉద్యమ నేపథ్యం ఉన్నది. కాబట్టి తెలంగాణ సోయి ఎవరో ఏమారిస్తే దారితప్పేది కాదు.

చరిత్రను బట్టీ కొట్టినవాడు కాదు మేధావి. చరిత్రను సృష్టించిన వాడిని మేధావి అంటారు. ఆ యుగ స్రష్ట కేసీఆర్. పాలకులు రావొచ్చు, పోవచ్చు. కానీ, కేసీఆర్ ఈ రాష్ట్రాన్ని సాధించారు. ఇవ్వాళ రాష్ట్ర అధికార చిహ్నంలోంచి చార్మినార్, కాకతీయ తోరణాలను రాచరిక ఆనవాళ్లని చెప్పి తొలగించే ప్రయత్నం విడ్డూరం. మరి తొలి ప్రధాని నెహ్రూ నుంచి రాజీవ్ గాంధీ దాకా ఎర్రకోట మీద జెండా ఎలా ఎగిరేశారు? అసలు ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతున్నదా? ఇప్పటికే గత ప్రభుత్వం ఏర్పరిచిన డాక్టర్ అంబేద్కర్ మహా విగ్రహానికి నివాళులర్పించకపోవడం వంటి అల్ప చేష్టలు, పలు సందర్భాల్లో ఆయన ఉపయోగిస్తున్న భాష ముఖ్యమంత్రి స్థానాన్ని దిగజార్చుతున్నాయి. చెప్పినవి చేయలేక దృష్టి మరల్చే పని పెట్టుకున్నారు. లేకపోతే గతంలో తెలుగు తల్లి చౌరాస్తాగా ఉన్నచోట ఇప్పుడు తెలంగాణ తల్లి నిలవడం కదా న్యాయం. అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఎలా పెడతారు? అమరజ్యోతి దగ్గర ఉండాల్సింది ఏ తెలంగాణ తల్లికైతే అమరులు ప్రణమిల్లి తమ ప్రాణాలు అర్పించారో ఆ తల్లి విగ్రహం కదా. జనం మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లిని సచివాలయం కంచెల లోపల పెట్టడం సామాన్యులకు దూరం చేయడం కాదా?

ఉప్పెన లాంటి ప్రజా ఉద్యమం ఇక్కడ ఎగసిపడుతుంటే పరాయి పార్టీల పంచన బతికిన వారికి ఇప్పుడు తెలంగాణ తల్లి గుర్తుకురావడమే విడ్డూరం. ఇక్కడి విద్యార్థులు, యువకులు ప్రాణాలు బలిపెడుతుంటే సమైక్య పాలకులకు మద్దతుగా తుపాకులు పట్టినవారి చేతిలో తెలంగాణ తల్లి రూపుదిద్దుకోవడమూ విషాదమే. చరిత్ర చదివితే ఏమొస్తుందని ఆర్ట్స్ కోర్సులు ఎత్తేసిన చంద్రబాబు వారసత్వమా ఇది? తెలుగు తల్లి ముందు తెలంగాణ తల్లిని తగ్గించి చూపే కుత్సితమా ఇది? లేక తన హృదయంలో లేని తెలంగాణ తల్లిని తెలంగాణ ప్రజల మనసుల్లోంచి కూడా చెరిపేసే కుట్రనా? కనీసం నోటి నిండా జై తెలంగాణ అని పలకలేని ఈ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తల్లి మాకెందుకు? ఊరూరా వలస పాలకులను సవాలు చేస్తూ ఉద్యమస్ఫూర్తి నింపిన మా తెలంగాణ తల్లి మాకుండగా.

**(వ్యాసకర్త: శాసనమండలి సభ్యురాలు)**

**సమైక్య పాలనలో ఇక్కడి నేల అడుగడుగునా విస్మరణలకు గురైన సందర్భంలో ఎగసిన తెలంగాణ బిడ్డల పునరుత్థాన కేతనంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపంలో నిలిచింది. ఇక్కడి సంస్కృతి ప్రతి సందర్భంలో అవమానాలకు గురవుతుంటే ఈ బిడ్డలు చేసుకున్న ధిక్కార ప్రకటన తెలంగాణ తల్లి.**



# ముమ్మాటికీ కాంగ్రెస్ తల్లే..!

**సమ్మక్క సారలమ్మ గుడి సింహద్వారంపై కొలువుదీరిన అమ్మవారికి కిరీటం ఉంది. ఉజ్జయినీ మహంకాళి, జూబ్లీ హిల్స్ పెద్దమ్మ, బల్కంపేట ఎల్లమ్మ తల్లులకు కిరీటాలున్నాయి. ఊరూరా వెలిసిన గ్రామదేవతలకు భక్తులు యథాశక్తి కిరీటాలు, ఆభరణాలు చేయించి అలంకరించే సంస్కృతి మనది.**

ఎములాడ రాజన్న, కొమురెల్లి మల్లన్న, యాదాద్రి నరసన్న, భద్రాద్రి రామన్న గుళ్లలో వేంచేసియున్న అమ్మవార్లకు కిరీటాలు ఉన్నాయి, ఆభరణాలూ ఉన్నాయి. ఏ గుడికి వెళ్లినా అమ్మవార్లు కళ్లకు నిండుగా దర్శనమిస్తారు. తెలంగాణ ప్రభుత్వానికి ఇదేం పోయేకాలం. ఆచార్య జయశంకర్ సార్ సహా తెలంగాణ మేధావులు, ఉద్యమకారులు, అభిమానులు త్రికరణశుద్ధితో రూపొందించుకొని, వాడవాడల ప్రతిష్ఠించుకొని దేవతగా ఆరాధిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది?



**డాక్టర్ అయాచితం శ్రీధర్**

కేసీఆర్ మీద, బీఆర్ఎస్ మీద కోపం ఉంటే రాజకీయాల్లో, ఎన్నికల్లో తేల్చుకోవాలి. అంతేకానీ, ఉద్యమ కాలం నుంచి ప్రజల గుండెల్లో నిలిచిన తెలంగాణ తల్లి రూపాన్ని చెరిపేసి, కాంగ్రెస్ తల్లిని సచివాలయంలో ప్రతిష్ఠించడం దిక్కుమాలిన చర్య. తెలంగాణ అస్తిత్వానికి ప్రతిరూపం బతుకమ్మ. మహిళల ఆరాధ్య దైవం కూడా. అట్లాంటి బతుకమ్మను తొలగించడానికి ప్రభుత్వ పెద్దలకు చేతులు ఎట్లా వచ్చాయి. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు తల్లి విగ్రహం ఎలా ఉందో వారు గమనించలేదా? ఇతర రాష్ట్రాల ముందు తెలంగాణను నవ్వులపాలు చేయాలనుకున్నారా? బతుకమ్మ లేకుండా చేతిగుర్తును చూపిస్తున్న ఆ తల్లి తెలంగాణ తల్లి కాదు.

ముమ్మాటికీ కాంగ్రెస్ తల్లే. కిరీటాలు, వడ్డాణాలు పేద మహిళలకు ఉండవని తన చర్యను సమర్థించుకుంటున్న ప్రభుత్వం ఆ పేద మహిళలు కూడా బతుకమ్మ ఆడుతారని, భక్తితో పూజిస్తారని, సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారని పరిగణించకపోవడం ఆశ్చర్యకరం. ఈ నేపథ్యంలో హిందూత్వ మల్లయోధులు, అధికారం వైపు మోహరించిన ఉద్యమకారులు నోరు విప్పాలి. ఎందుకంటే, నిన్న మొన్నటి వరకు వారంతా తెలంగాణ తల్లికి దండలు వేసి దండం పెట్టుకున్నవాళ్లే కదా.

# ఏడాది గడిచినా జాడలేని పరిణతి



**టంకశాల అశోక్**

***ఒక ముఖ్యమంత్రికి పరిపాలన ఎంత ముఖ్యమో నిజాయితీ, పరిణతి కూడా అంతే ముఖ్యమైనవి. రేవంత్‌రెడ్డిని తీసుకుంటే, ఆయనకు ఏడాది క్రితం ముఖ్యమంత్రి కావటానికి ముందు ఎటువంటి పాలనానుభవం లేదు. కానీ, అందులో ఆక్షేపించవలసిందేమీ లేదు. కొత్తగా అధికారానికి రావటం జరుగుతూనే ఉంటుంది. కావలసింది అటువంటి మంచి అవకాశాన్ని ఉపయోగించుకొని, మంచి పాలనను క్రమంగా నేర్చుకుంటూ, పరిణతిని సాధించటం. అదే క్రమంలో, నిజాయితీపరుడనే పేరు తెచ్చుకోవటం. ఈ దిశలో చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయం అంటూ కలిగితే, పాలకుడు తొలుత కొంత తడబడినా ప్రజలు తప్పక అర్థం చేసుకుంటారు. మరికొంత సమయమిస్తారు. కానీ, రేవంత్‌రెడ్డిలో ఈ లక్షణాలు ఇప్పటికీ కనిపించటం లేదు.***



కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న ఒక ముఖ్యమైన ఉదాహరణను చూద్దాం. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా ఈ నెల 4వ తేదీన దిన పత్రికల మొదటిపేజీలో, 'తొలి ఏడాదిలోనే 55,143 ఉద్యోగ నియామకాలు' అంటూ ప్రకటనలు ఇచ్చారు. ఏ శాఖలో ఎన్నెన్నో అందులో పేర్కొన్నారు. ఆ వివరాలను పరిశీలించినప్పుడు అందులో పరిపాలనాదక్షత, నిజాయితీ, పరిణతి అనే మూడు కూడా కనిపించవు. కాంగ్రెస్ ప్రభుత్వపు నిజ స్వరూపం ఈ ఒక్క ఉదాహరణతోనే తెలిసిపోతుంది. ఈ మాట అనేందుకు తగిన కారణాలున్నాయి తప్ప ఇది గాలి విమర్శ కాదు. ప్రభుత్వం పేర్కొన్న 55,143 ఉద్యోగాలలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు 50,127. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చినవి 12,527 ఉద్యోగాలకు మాత్రమే. తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మొదటి ఏడాదిలోనే కొత్తగా 2 లక్షలని. ఈ వేర్వేరు అంకెల మధ్య తేడాలేమిటో కనిపిస్తున్నవే అయినందున వేరే వ్యాఖ్యానాలు అవసరం లేదు. ఈ వాస్తవికమైన లెక్కలు ఎన్నోసార్లు ముందుకువచ్చినా ప్రభుత్వం వద్ద సమాధానం లేకపోవటం గమనించదగ్గది.

అదే సమయంలో కొన్ని విషయాలు చెప్పుకోవాలి. తాము ఇచ్చామంటున్న 55,143 ఉద్యోగాలలో 50,127 ఉద్యోగ నోటిఫికేషన్లు గత ప్రభుత్వం ఇచ్చినవేనని గాని, కేవలం ఎన్నికల కోడ్ రావటంతో ఆ నియామకాలు ఆగాయని గాని, తాము ఏడాది కాలంలో ఇవ్వగలమన్న 2 లక్షల కొత్త ఉద్యోగాలకు బదులు నోటిఫికేషన్లు ఇచ్చింది 12,527కు మాత్రమేనని గాని ప్రభుత్వం నిజాయితీగా చెప్పొచ్చు. తాము ఇచ్చినట్టు పదే పదే చాటుకునే నియామక పత్రాలన్నీ కేసీఆర్ కాలపు నోటిఫికేషన్లవి మాత్రమేనని, కొత్తగా చేసింది లేదని స్వయంగా నిరుద్యోగులు, వారి టీచర్లు అశోక్‌నగర్‌లో గొంతెత్తి వాదిస్తున్నా అందుకు జవాబివ్వదు. కానీ, 7వ తేదీకి ఏడాది పూర్తయిన సందర్భంగా నల్లగొండ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమదేనని, నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి వారి రుణం తీర్చుకోవద్దా అని, మొదటి ఏడాదిలో ఇన్ని ఉద్యోగాలిచ్చిన రాష్ట్రమేదీ మొత్తం దేశ చరిత్రలోనే లేదని అంటారు. దీనిపై కూడా వ్యాఖ్యానాలు అవసరం లేకుండానే నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజలు అర్థం చేసుకోగలరు. అవి ప్రభుత్వానికి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే వట్టి బుకాయింపులని కనిపిస్తున్నదే.

కొంత వెనుకకు వెళ్తే, గత ఎన్నికల సమయంలో నిరుద్యోగ సమస్య బాగా ప్రచారంలోకి వచ్చింది. ఉద్యోగ, ఉపాధి సమస్యలు ప్రపంచమంతటా, దేశమంతటా తీవ్రంగా ఉండటం, అందుకు కారణాలేమిటనే చర్చను పక్కన ఉంచుదాం. అందుకు ఇది సందర్భం కాదు గనుక. కానీ, ఆ సమస్య తెలంగాణలోనూ ఉండటమన్నది వాస్తవం. అందువల్ల అది సహజంగానే యువతరంలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఎన్నికల సమయం గనుక ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ దానిని సమర్థవంతంగా ఉపయోగించుకున్నది. సమస్యలకు గురవుతుండిన యువతరం కాంగ్రెస్ పక్షం వహించింది. ఆ వేడిలో, తాము అధికారానికి వస్తే మొదటి ఏడాదిలోనే కొత్తగా 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వగలమనే కాంగ్రెస్ హామీ వారిని కట్టిపడవేసింది. మరొకవైపు, బీఆర్ఎస్ ప్రభుత్వం తన పదేండ్లలో 'అసలు ఏ ఉద్యోగాలు ఇవ్వనేలే'దన్న అసత్య ప్రచారానికి అప్పటి వాతావరణంలో యువతరం, సాధారణ ప్రజలు కూడా ప్రభావితులయ్యారు. రాహుల్, ప్రియాంకల అశోక్‌నగర్ సందర్శనలు అందుకు తోడయ్యాయి. ఒక్కోసారి పరిస్థితుల ప్రాబల్యంతో అసత్యాలు నిజాలుగా చలామణీ అవుతుంటాయి.

**అటువంటి పరిస్థితుల మధ్య, కేసీఆర్ పాలన పదేండ్ల కాలంలో నియామకాల వాస్తవాలేమిటన్నది ఎవరికీ పట్టలేదు. ఎవరైనా చెప్పినా, వ్యతిరేక ప్రచారపు హోరు ముందు అది తేలిపోయింది. వాస్తవాలేమిటి? బీఆర్ఎస్ పదేండ్లలో కలిపి ఆర్థికశాఖ అనుమతించిన ఉద్యోగాలు 2,32,308. నోటిఫికేషన్లు ఇచ్చినవి 2,02,735. వాస్తవంగా భర్తీ చేసినవి 1,60,083. ఈ సంఖ్యలను ఉమ్మడి రాష్ట్రపు కాంగ్రెస్ పాలన (2004-14)తో పోల్చితే, అప్పుడు తెలంగాణలో జరిగిన మొత్తం నియామకాలు కేవలం 10,080. అనగా, కాంగ్రెస్ పదేండ్ల కన్న బీఆర్ఎస్ పదేండ్లలో సుమారు 15 రెట్లు ఎక్కువ.**

ఈ అంకెలు ఏవీ ఊహాగానాలు కావు, గాలి మాటల ప్రచారాలు కావు. అన్నీ ప్రభుత్వ రికార్డులలో ఉన్నవే. ముఖ్యమంత్రి, అధికారపక్షం వారు, తమను సమర్థించే మేధావి బృందాల వారు తేలికగా తనిఖీ చేయవచ్చు. సమాచార హక్కు కింద నిరుద్యోగులు, విద్యార్థులు, లేక మరెవరైనా గాని దరఖాస్తు చేసినట్టయితే సమాచారం ఇవ్వగలరో లేక ఏదో ఒక సాకుతో తొక్కిపెట్టగలరో తెలియదు గాని, ఇవన్నీ రికార్డులలో ఉండే వివరాలే. ఇదంతా తెలిసినా, తెలియకపోయినా నిరుద్యోగులకు వాస్తవ పరిస్థితి అర్థం కావటం మాత్రం కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల నుంచే మొదలైంది. దాని సారాంశం తాము మోసానికి గురవుతున్నామని. ఆ నిరాశాభావంతో తిరిగి ప్రశ్నించటం మొదలుపెట్టారు. కొత్త ప్రభుత్వం ఇస్తున్న నియామక పత్రాలు గత ప్రభుత్వపు నోటిఫికేషన్లవే తప్ప, కొత్తవి ఏవంటూ నిలదీశారు. వాటిలో అదనపు ఖాళీలు ఎక్కడున్నాయన్నారు. తమకిచ్చిన హామీలకు విరుద్ధంగా ఉన్న జీవోల రద్దుకు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమకు మద్దతు ప్రకటించటమే గాక, కాంగ్రెస్ ప్రచార రథాలకు జెండాలూపిన మేధావి మహాశయులు ఇప్పుడు తమ వద్దకు రావటం లేదు ఎందుకన్నారు. పదవులతో మైమరచిపోయారా అని సందేహించారు. రాహుల్, ప్రియాంక, రేవంత్‌లు ఇప్పుడు వచ్చి తమతో తిరిగి చాయ్ తాగాలని ఆహ్వానించటం మొదలుపెట్టారు.

అందుకు బదులుగా వారికి లభించిందేమిటి? నిర్బంధాలు, లాఠీచార్జీలు, అరెస్టులు. మూడు రోజుల క్రితం 7వ తేదీన ఏడాది నిండుగా పూర్తయినప్పుడు పత్రికలలో, బహిరంగ సభలలో ఉద్యోగ భర్తీలపై అబద్ధపు ప్రకటనలు. ఏడాదిలో కొత్తగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలన్న హామీ, వచ్చే నాలుగేండ్లలోనైనా నెరవేరుతుందో లేదో తెలియని పరిస్థితి. ప్రైవేట్ రంగంలో ఏదేదో జరగగలదంటూ మాత్రం రకరకాల హడావుడులు. ఆ విధమైన ఆశలు కల్పిస్తే నిరుద్యోగ యువతరం దృష్టి అటువైపు మళ్లి, తమ 2 లక్షల ఉద్యోగ హామీ దారుణ వైఫల్యాన్ని మరిచిపోగలరన్నది ఆశాభావం కావచ్చు. లేదా మోసపూరిత ఎత్తుగడ కావచ్చు. ప్రైవేట్ రంగం కావలసిందే. అది గతంలో ఉంది, ఇప్పుడుంది, మునుముందు కూడా ఉంటుంది. ఆ రంగంలో అవకాశాలకు తగిన విద్య, శిక్షణలు కల్పిస్తే ఆహ్వానించదగినదే. కానీ అది కూడా వివిధ పరిస్థితుల వల్ల పరిమితంగానే జరుగుతున్నట్టు ప్రపంచమంతటా, దేశమంతటా, ఇక్కడ కూడా కనిపిస్తున్నదే. కనుక, రేవంత్ ప్రభుత్వం యువతరానికి సరికొత్త భ్రమలు కల్పించటం సరికాదు. తమ ఎన్నికల హామీ విషయమై నిజాయితీగా మాట్లాడాలి.

అంతిమంగా తేలుతున్నదేమిటి? మొదట ఉండిన హంగామాలే ఏడాది గడిచినాక కూడా కనిపిస్తున్నాయి. పరిపాలనలో నేర్చిన అనుభవ పాఠాలు, నిజాయితీ, పరిణతి కన్పించటం లేదు. ఇదే స్థితి వ్యక్తిగత వ్యవహారణలోనూ ప్రతిఫలిస్తున్నది. దీనంతటికీ కారణం తన వ్యక్తిత్వంలోనే ఉన్న రకరకాల కొరతలు, లోపాలేమో తెలియదు.